# బలహీనత

— దేవి —

దీర్ఘకాయాన్ని మెల్లగా ఈడ్చుకొంటూ కలకత్తా వెళ్లే మెయిలు 'ఉస్సు'మంటూ వచ్చి గోదావరిస్టేషనులో ఆగింది. బండిదిగి ఎక్కేవాళ్ల కోలాహలం ఎక్కువగావుంది. చేతిలో చిన్నసూటుకేసు పట్టుకుని ముఖం కనపడకుండా ముసుగు వేసుకుని జనాన్ని అతికష్టంతో తప్పించుకొని వస్తూవుండే ఆ యువతిని సుధ స్త్రీలపెట్టెలోనుంచి చూస్తూనేవుంది. ఆమె తిన్నగా స్త్రీలపెట్టెలోకే ఎక్కింది. పెట్టెను పైనున్న పలక మీద వుంచింది. ముఖంలో కనపడే దైన్యం, దుఃఖం కనపడకుండా తార ముసుగు నిండుగా వేసుకొనివుంది. కాని పెట్టెను పెట్టడములో ప్రక్కనేవున్న సుధకు ముఖము దాచలేకపోయింది. తారాసుధలు ఒక్కమారుగా చలించారు. కుములుతూవున్న దుఃఖం గభాలున పైకిపొంగింది తారకు.

నిలువునా పడిపోయింది తార సుధ ఒడిలో. 'అక్కయ్యా!' అంటూ చుట్టూ అంతమందివున్నారనే సంగతే మరచిపోయి ఏడవడానికి ప్రారంభించింది తార.

సుధకు నోట మాటరాదు. తారను దగ్గరకు దీసుకొని తల నిమురుతుందేగాని ఏమి మాటాడవలెనో తెలిసిందికాదు. ఈప్రయాణంలో తార తనకు కనపడుతుందని కలలోకూడా నమ్మలేదు సుధ. పైగా అకస్మాత్తుగా కనపడి తార యేడుస్తూవుంది తన ఒడిలో. తారకది ఎప్పటి దుఃఖమే అయితే అంతమందిలోకూడా అలా ప్రవర్తింపవలసిన అవసరముండదే!

సుధ కొంచం తెప్పరిల్లి, 'ఇదో తారా! ఎక్కడకు వెళ్లుతున్నావమ్మా? ఏడవడం దేనికి?' అంది.

చుట్టూ కూర్చున్నవారంతా వింతగా వీరిద్దరినీ చూస్తున్నారు. సుధ పక్కనసేవున్న ఓ పెద్దముత్తైదువ ఆశ్చర్యంచేత నోటితాళాలు వీడిపోయినట్లు నోరు తెరుచుకొని ఓప్రక్కగా చూస్తూంది.

ఇప్పుడామెకు తనజీవితంలో ఇరవైయేళ్లుకూడా గడువలేదు. అప్పుడే అసహాయురాలు. మాతృహీన భర్తృహీనగూడ. తండ్రి తనవుద్దేశాలకు వ్యతిరేకవాది. ఇవన్నీ ఆలోచించుకుంటే ఆ అమ్మాయికడుపు తరుక్కుపోయేది. ప్రపంచమంతా అంధకారమయంగా కనిపించేది. తన తండ్రి యీ యుపేక్షాభావానికి కారణమేమిటి? తనకి చిన్నప్పుడే పెళ్లిచేయడం దేనికి? ఈ వ్రాతేమిటి? కర్మ కర్మ అంటుంది లోకం!! కర్మెందుకవుతుంది? తనకి చిన్నప్పుడే పెళ్లి చేయకపోతే కర్మ వచ్చి చేస్తేగాని వల్లగాదని అడ్డగించిందా? అంతా బూటకం, మాయాను. ఏదో వొకటి వెనుకాముందూ విచారించకుండా చేసేది. కర్మ అనేది! తన కావిషయం ఏమీ తెలియనప్పుడు తన నలా ఎందుకనాలి ప్రపంచం?

తార కన్నీళ్లు తుడుచుకుని సుధ కింకా దగ్గరచేరి తల క్రిందికి వంచుకొంది.

రైలు అతివేగంగాపోతూవుంది.

తారా సుధలు కిటికీనుండి బైటికి చూస్తున్నట్లు తలలు త్రిప్పుకున్నారు.

పెట్టెలోనివాళ్లు వారివారి ప్రసంగాల్లో వారు మరల నిమగ్నులయ్యారు.

'తారా! ఎంతవఱకమ్మా?' అంది సుధ తార వీపుమీద చేయివైచి.

'నాన్న వుత్తరం వ్రాశారు వెంటనేరమ్మని. వళ్లు నెమ్మదిగాలేదట!' అంది తార సుధవైపు చూడకనే.

'అయితే నీవు సెలవుల్లో వూరికిపోలేదా?'

'ఊహూ!'

'ఎందుకని?'

'నాన్నగారికి నామీద నానాటికి కోపం ఎక్కువౌతూవచ్చింది. మొన్న మా 'సదనాని'కి వచ్చి నేను చెడిపోతున్నానని గట్టిగా కోపంచేసుకున్నారు. వూరికివెళ్లడానికి భయంగావుండి ఇక్కడేవుండి చదువుకుందామనే మిషతో మానేశాను' అంది తార సుధ ముఖములోనికి చూస్తూ.

'అయితే వారు తమ వుద్దేశాలను కొంచంకూడా మార్చుకోడానికి ప్రయత్నించ లేదన్నమాట' అంది చిరునవ్వు నవ్వుతూ సుధ.

'పైగా మొన్న వారిలా అన్నారు. 'నీ విట్టి వుద్దేశాలు బలపరచుకోడానికి సుధగూడా తోడ్పడిందని నాకు తెలుసు. అదెంతమాత్రమూ బాగు లేదు.'

'అయితే నీవుద్దేశం ఏమిటని?'

'మా స్కూలులోనే వుపాధ్యాయినిగా పని చేస్తూ నాసంకల్పం నెరవేర్చుకోడానికి ప్రయత్నించ డంకంటె ఏముంది?'

'మీ నాన్నగారు అక్కడ వుండనిస్తారా?'

'మా సూపరెండెంటుగారు నన్ను అక్కడవుండ నీయాలని నాన్నకు గట్టిగా చెప్పారు. వారు అంగీకరించారు.'

'సరేగాని మీ నాన్నగారు అనారోగ్యమన్నావు గదూ.'

'అవును. అందుకే వెళ్లడం.' మరీ తార కన్నీరు కార్చడం మొదలుపెట్టింది.

'తారా! ఇంక చాల్లెద్దూ' అంది సుధ కళ్లు తుడుస్తూ.

ప్రక్కన్నే నోరుతెరిచి చూస్తూవున్న ఆమెకీ సోదేమీ అర్థం అయ్యిందికాదు.

'వూరుకో అమ్మాయీ! మీ నాన్నగారికి నయంగానేవుంటుంది లే' అందామె ఉపశమనంగా.

'అది కాదక్కయ్యా! నన్నింతచేసి విద్యాబుద్ధులు చెప్పించిన నాన్నగారికి నావుద్దేశాన్ని మన్నించేటంతటి విశాలహృదయం లేకపోయిందికదూ. వారు వృద్ధులు. ఇపుడారోగ్యము సరిగాలేదు. కాబట్టి వారిని సంతోషపెట్టడానికి నా వుద్దేశాలను కొంత కాలం దాచేయాలనివుంది' అంది తార.

'దానికంటె వారి నేవిధంగానైనా ఒప్పించి నీవు సుఖపడడం వుత్తమంగదూ' అంది సుధ.

వారి సంభాషణ సాగుతూనేవుంది ఇదేధోరణిలో. సామర్లకోట వచ్చింది.

'సామర్లకోట వచ్చింది. విశాఖపట్టణం వెళ్లుతానన్నావు కదా. తిరిగి చెన్నపట్నం వెళ్లడం ఎపుడో చెప్పితే నిన్ను రైల్లో చూస్తాను రాజమండ్రిలో.'

'తారా! నిన్నిలాగా ఆకస్మికంగా చూచి వెళ్లిపోవడమేగాని నీతో కొంతకాలంవుండే భాగ్యదినాలు గతించాయి. మన స్నేహలత ఈవిధంగా బలవంతాన వేరుచేయబడుతూవుంది. నీవు బాగుపడేదారి అదేనంటే మీ నాన్నగారికి కోపంవచ్చింది. కాని కాలం అన్నింటినీ చక్కచేస్తుందిలే!' అన్నది సుధ.

రైలు ఆగింది. తారాసుధలు అతికష్టంతో విడివడ్డారు. తార కాకినాడ వెళ్లేబండికి వెళ్లిపోయింది. సుధ అటువైపే చూస్తూ కూర్చుంది.

వారి సంగతి తన కయోమయంగావున్నా 'అయ్యో పాపం' అంది ఆప్రక్కనవున్న ముత్తైదువ.

రైలు కదిలింది. ఆమె సుధవైపు జరిగింది.

'అమ్మాయీ! ఇప్పుడు వెళ్లిన అమ్మాయి ఎవరు? ఆమె దుఃఖము, వారి నాన్నగారి కోపము, ఆమె వుద్దేశాలు, ఇవన్నీ మీరు మాట్లాడారు. ఏదో పెద్ద దాన్ని. ఆ అమ్మాయి దుఃఖం చూస్తూంటే ఆమె సంగతేమిటో కనుక్కోవాలనిపించింది.' ఆమె ప్రార్థనాపూర్వంగా అడిగింది.

'అదో దురదృష్టవృత్తాంతం. ఎవరైనా అయ్యో అంటారు వింటే—ఆచారాలకు సంఘానికి భయపడుతూవున్నప్పటికీ.' ఇంకా ఆ వాతావరణంలోనేవుంది సుధ.

'అదేమిటో చెప్పవచ్చు. నా తల్లిగదూ' అంటూ మరింత దగ్గరవచ్చింది ఆమె.

కిటికీలో మోచేయిపెట్టి ఆచేతిని గడ్డానికి ఆధారంగావుంచి ఆమె వినడానికి తయారైంది. 'ఉస్సు' మంటూ హృదయభారాన్ని తగ్గించుకోనడానికి సుధ ఆవిడ కంతా చెప్ప మొదలెట్టింది.

* * *

సుధాతారలు చిన్ననాటి స్నేహితురాండ్రు. సుధ నాన్నగారైన రామారావుగారికి తార నాన్నగారగు నారాయణరావుగారికి ఒకేఆఫీసులో పని అవటంమూలాన వాళ్లిద్దరి పరిచయం ఏర్పడింది. ఆపరిచయమే విపరీతమైన స్నేహంగా పరిణమించింది. కుటుంబాలు వేరువేరుగా ఉన్నా అన్నతమ్ముల కంటె ఎక్కువగా కలిసిమెలిసి ఉంటుండేవారు. రామారావుగారికి సుధ ఒక్కతే కూతురు. నారాయణరావుగారికి తార ఒకబ్బాయి ఉన్నారు.

సుధ తారకంటె ఒక సంవత్సరం పెద్దది. ఇద్దరూ సుమారు ఒకేవయస్సు కలవారవటంవల్ల ఎంతో స్నేహంగా ఉంటుండేవారు. ఒకే స్కూల్లో చదువుతుండేవారు. అప్పుడు వాళ్లిద్దరినీ చూచి ముచ్చటపడనివాళ్లు లేరు. వాళ్లు ఆటల్లో పాటల్లో ప్రపంచాన్నే మరిచేవారు. గాఢమైన స్నేహలత వాళ్లిద్దరినీ చుట్టివేసింది. వాళ్లొకర్ని విడిచి ఒకరు ఒక్క నిమిషమైనా ఉండేవారు కారు. ఆసమయంలో వారికి సంవత్సరాలు నిమిషాల్లాగా దొర్లిపోయాయి. తారకి ఎనిమిదేళ్లు నిండాయి. తార పెళ్లైంది.

నారాయణరావుగారు సంఘంలోని కట్టుబాట్లకు కొన్నిటికి పూర్తిగా లొంగిఉండడంవల్ల రామారావుగారి మాటగూడ వినక తారకి పెళ్లిచేయక తప్పిందిగాదు. ఆ అమ్మాయికి ఆ పెళ్లేమిటో ఆ భర్తేమిటో ఏమీ తెలిసిందికాదు. అప్పుడే ఆమె ఒక అత్తింటి కోడలైపోయింది. కాని తార తాను సుధా తప్ప ప్రపంచాన్నేమాత్రమూ ఎరుగని ఒక బేల.

కాలచక్రం తిరిగిపోతోంది. అప్పుడే తార పెళ్లయి నాలుగు మాసాలైంది.

ఒకదినం మధ్యాహ్నం 12 గంటలైంది. తారాసుధలు ప్రక్కవరాండాలో ఆడుకుంటున్నారు. తార తల్లిదండ్రులు పిల్లవాని ముద్దుముచ్చటల సంతోషంలో ఉన్నారు. పోస్టుజవాను వచ్చి నారాయణరావుగారి చేతికి ఒక టెలిగ్రాం అందించి వెళ్లాడు. దాన్ని విప్పిచూడ్డంతోనే నారాయణరావుగారి కాళ్లు చేతులు వణికాయి. అంతవరకుందున్న సంతోషసౌధం ఒక్కమారు గుప్పున కూలిపోయింది. దానిలో తారభర్త టైఫాయిడ్ జ్వరంవల్ల మరణించాడని వెంటనే తారతోగూడ బయలుదేరి రావాలని ఉంది.

ఈవిషయం ఊరంతా తెలిసిపోయింది. తారను చూచి దుఃఖించనివాళ్లు లేరు. ఇప్పుడామె ప్రపంచ

దృష్టిలో విగతభర్తృక. పాపం!! తార కిదంతా ఏమీ తెలియక అందరూ ఏడుస్తుంటే వింతగా చూస్తూ కూచుంది. ఆ అమాయకత్వాన్ని చూచేటప్పటికి తల్లికడుపు చెరువైపోయింది. ఆ దిగులుతోనే మంచంపట్టింది. అది తీరనివ్యాధిగా పరిణమించింది. మరి మూడు సంవత్సరాలకల్లా ఆకూతుర్ని కొడుకుని భర్తచేతులో పెట్టి ఆతల్లి జీవునిలో లీనమైపోయింది.

నారాయణరావుగారికి భార్యావియోగదుఃఖం ఒకవైపు, కూతురుస్థితి మరొకవైపూ పీడిస్తున్నాయి. ఈ అభ్యంతరాలు వచ్చినా కూతురుకుమాత్రం చదువు మాన్పించక సుధతోనే స్కూలుకు పంపిస్తున్నారు. తార యుక్తవయస్కురాలైంది. ఇప్పుడు తారకు తన సంగతంతా కన్నులకు గట్టినట్లు తెలియవస్తూ వుంది. కర్ణపరంపరగా వినడంవల్ల తనకు చిన్ననాడే వివాహమైందని, భర్త పోయాడని తెలిసింది. ఆ అమ్మాయి తనస్థితికి ఎంతో దుఃఖించేది. రాత్రింబవళ్లూ తనకు చిన్ననాడే జరిగిన అన్యాయాన్ని తలచుకుని కుళ్లికుళ్లి ఏడ్చేది. తన భావిజీవితం ముమ్ముందు ఎలాగడుస్తుందో అని ఎంతో విచారపడేది. కాని సుధ తారకు దుఃఖోపశాంతికి ఏవేవో విషయాలు చెప్పి మాన్ప ప్రయత్నించేది. ఏవిషయంలోకూడ విచారానికి తావిచ్చేదిగాదు. సాధ్యమైనంతవరకు తార సుధ సలహాలనే అంగీకరిస్తూ సుధాపథాన్నే త్రొక్కేది.

ఇలాఉంటుండగా సుధ నాన్నగారికి చెన్నపట్టణానికి బదిలీఅయింది. తార కీవిషయం తెలియడంతోనే మితిలేని దుఃఖం కలిగింది. తల్లి మరణానికంటె కూడ సుధా వియోగదుఃఖం దుర్భరమనిపించింది. చిన్నప్పటినుంచీ పెనవైచుకొనిపోయిన స్నేహబంధం తనంతటదే పట్లు సడలిపోతున్నట్లనిపించిం దామెకు. సుధ వెళ్లినప్పటినుంచీ తార కేమీ తోచేదిగాదు. ఎటుచూచినా సుధే కన్నులకి సాక్షాత్కరించేది. రోజులు గడుస్తున్నా సుధావియోగం నిత్యవ్యవహారాల్లో ఒకటైపోయింది తారకి.

తార చదువు నిరంతరాయంగా జరుగుతూవుంది. ఇంటరు పూర్తిగావచ్చింది. కాని ఒక విచారం మాత్రం తారను వేదిస్తూవుండేది. ఏమంటే తండ్రి సంస్కరణవాది పైకిమాత్రం. లోపల సంఘం అంటే సూడలు. అందుచేత పునర్వివాహం అంటే తనకు సుతరామూ ఇష్టములేనట్లు అపుడపుడూ తన వుద్దేశం వెలువరిస్తూవుండేవాడు. అది విన్నపుడంతా తారకు ఏదో బాధగావుండేది.

తారకు తండ్రి యుపేక్ష తనవిచారాన్ని మరింత ఎక్కువచేసింది. తన జీవితపథనిర్ణయం పెద్దసమస్య అయిపోయింది. తన మనస్సులో ఏమేమో విచారించుకునేది. తనతండ్రి బ్రతికున్నంతవరకే తన కీమాదిరిగా కాలం గడుస్తుంది. పిదపకూడా స్వార్జితం మీద తాను సుఖంగానే బ్రతుకవచ్చు. అయినా ఆదరించేదెవరు? తన కష్టసుఖా లెవరితో చెప్పుకోవాలి? ఆ పసికందు తమ్ముని పోషించడముతోనే తనజీవితం సరా? ఇటువంటివే ఆమె ప్రశ్నలు.

ఇప్పుడామెకు తనజీవితంలో ఇరవైయేళ్లుకూడా గడువలేదు. అప్పుడే అసహాయురాలు. మాతృహీన భర్తృహీనగూడ. తండ్రి తనవుద్దేశాలకు వ్యతిరేకవాది. ఇవన్నీ ఆలోచించుకుంటే ఆ అమ్మాయి కడుపు తరుక్కుపోయేది. ప్రపంచమంతా అంధకారమయంగా కనిపించేది. తన తండ్రి యీ యుపేక్షాభావానికి కారణమేమిటి? తనకి చిన్నప్పుడే పెళ్లిచేయడం దేనికి? ఈ వ్రాతేమిటి? కర్మ కర్మ అంటుంది లోకం!! కర్మెందు కవుతుంది? తనకి చిన్నప్పుడే పెళ్లిచేయకపోతే కర్మ వచ్చి చేస్తేగాని వల్లగాదని అడ్డగించిందా? అంతా బూటకం, మాయాను. ఏదో వొకటి వెనుకాముందూ విచారించకుండా చేసేది. కర్మ అనేది? తన కావిషయం ఏమీ తెలియనప్పుడు తన నలా ఎందుకనాలి ప్రపంచం?? ఇలా విచారించేది ఎప్పుడూ. ఎలాగైనా తనజీవితానికి ఒక సౌఖ్యాధారం కల్పించుకోవాలని, పెళ్లాడాలని స్థిరనిశ్చయం చేసుకుంది.

తన వుద్దేశం ఇలావుందని సుధకు వ్రాసింది. సుధ దాన్నెంతో ఆమోదించింది. తార ఆశయాలు ఫలించడానికి తాను సాధ్యమైనంతవఱకు తోడ్పడతానని జబాబిచ్చింది.

ఆ తరువాత తారా సుధలు మూడుమార్లు పట్నములో కలుసుకున్నారు. భావిజీవితములో తార ఏ విధానాన్ని అవలంబించాలో తీర్మానించుకున్నారు. అయితే తార నాన్నగారు దాన్ని మన్నించాలి గాదూ ?

సుధ రెండేళ్లక్రింద తాను కాకినాడ వెళ్లినపుడు నారాయణరావుగారితో ప్రకృత సంఘ పరిస్థితులు మాట్లాడుతూ తార ఆశయాలు తన వుద్దేశము తెలియపరచింది.

తన అభిప్రాయాలను తెలుపకుండా చూస్తామని నారాయణరావుగారు మౌనం వహించారు.

తరువాత తార సెలవులలో ఇంటికి వెళ్లింది. తండ్రి ఎప్పటిలాగ లేడు. భయపడుతూనేవుంది తార. ఒకనాడు 'చదివించినదానికి పెడబుద్ధులు పుడుతున్నాయి. అందులో స్నేహితుల ప్రోత్సాహం ఎక్కువౌతూవుంది. భద్రం' అంటూ గర్జించారు నారాయణరావుగారు.

*　　　*　　　*

'విన్నారండీ! ఇపుడు వెళ్లిన ఆమె తార. నేనే సుధను. ఇపుడామె బి.ఎ. పరీక్షకు వెళ్లింది. అప్పటినుంచీ తార మనోవ్యసనముతో కృశిస్తూవుంది. వారి నాన్న తన వుద్దేశాలకు వ్యతిరేకంగా వివాహం మీద దృష్టివుంటే అని సూటిపోటి మాటలేగాకుండా నిరాదరణ ఎక్కువచేస్తూ వచ్చాడు. చూచారుగా ఇపుడామె ఏలావుందో ?' అంది సుధ.

'అదేమిటమ్మా! ఈ కాలంలో చదివినవాళ్లు లోకాన్నే లెక్కచేయడములేదే ? ఈ అమ్మాయికెందుకంత దుఃఖం ?'

'అక్కడే చిక్కువచ్చింది. తార హృదయం అతి లలితం, పిరికికూడా. దేనికీ ధైర్యం వహించడముచేత కాదు—చింతించడానికామెకు వున్నంత నేర్పు ఇతరావాటిలో లేదు.'

'పోనీ మీరైనా దగ్గరచేర్చి ఆమెను ఓదార్చరాదూ ?'

'నేనామె వుద్దేశాలకు తోడ్పడుతానని తెలిసినప్పటినుంచీ నేనంటే నారాయరావుగారికి సరిపడదు. అందుచేత నావద్దకు రావడానికి తారకు అమితభయం. నేనే ధైర్యం వహించి ఏమైనా చేద్దామా అంటే 'నాన్నకు కోపంవస్తుంది, వద్ద'ని నన్నే బ్రతిమాలుతుంది. పిచ్చిది.'

'ఔనుమరి. తండ్రిని కష్టపెట్టడం బాగుంటుందా?'

'బాగావుంది. తండ్రిని కష్టపెట్టకూడదు. తాను ఏడవకుండా వుండకూడదు, ధైర్యమో సహనమో రెండూ లేకపోతేనే ఈ అవస్థ' అంది విసుగ్గా సుధ.

'నిజమే తల్లీ! నిజమే' అంటూ ఇంతసేపూ అక్కరతో వింటూవున్న ఆమె ప్రక్కన ఎవరో లోకాభిరామాయణం మాట్లాడుతూవుంటే, అటువైపు తిరిగి కూర్చుంది.

సుధ ఆలోచనలో మునిగిపోయింది.